

అరకొర నిధులు..పనులు

సాగర్ కాలువల మరమ్మతుల విషయంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అరకొర నిధులివ్వడంతో కాలువల మరమ్మతు పనులు కూడా అరకొరగానే చేశారు. - - 8లో..



గ్రావెల్ తవ్వకాల్లో బరితెగింపు

బేస్తవారిపేట మండలం మోక్షగుండం సమీపంలోని కొండను తవ్వి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. 2 జేసీబీలు, 20 ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం

37 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు వన్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డీ జయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత గురుకులాల్లో దరఖాస్తులను విద్యార్థులు సమర్పించాలన్నారు. దరఖాస్తులు సమర్పించే విద్యార్థినీ, విద్యార్థులు 10వ తరగతిలో ప్రవేశాలకు 9వ తరగతిలో 60 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాలు పొందగోరే వారు మొదటి సంవత్సరంలో 50 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని చెప్పారు. కుల ప్రాతిపదికన రోస్టర్ విధానంలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఈ నెల 16వ తేదీ లోపు సంబంధిత పాఠశాల, కళాశాలలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

- ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్‌శాఖ సీఐ కొండారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: మండలంలోని పాత మల్లాపురం, శింగరపల్లెలో బెల్ట్‌షాపులపై కంభం ప్రొహిబిషన్‌–ఎక్సైజ్‌శాఖ సీఐ కొండారెడ్డి తనిఖీలు నిర్వహించారు. సోమవారం సాక్షిలో 'ఊరూరా ఎల్లో బెల్ట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పాత మల్లాపురంలో 15 మద్యం క్వార్టర్ బాటిళ్లు కలిగిన కే దాయదును పట్టుకున్నారు. శింగరపల్లెలో పేరయ్య, గోవిందరెడ్డిలను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు.

యువతను మోసం చేస్తే ఊరుకునేది లేదు

- కూటమి ప్రభుత్వానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: గత ఎన్నికలకు ముందు కూటమి నాయకులు విద్యార్థులు, యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఏడాది పాలన పూర్తి చేసుకున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రభాకర్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం యువతను మోసం చేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాని డిమాండ్ చేశారు. ప్రతి నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇవ్వాలని, అన్నీ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించి అభివృద్ధి చేయాలని, 26 జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని చెప్పారు. అవసరమైతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి మాట్లాడుతూ కనిగిరి నిమ్జ్, దొనకొండలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.రాంబాబు, గోపి, మత్తయ్య, శాంబాబు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జా తమ్ముళ్లు .. రాజీకీయాలు!



ప్రభుత్వ, ప్రైవేటు భూమి అనే తేడా లేకుండా అధికార తెలుగుదేశం పార్టీ నేతలు చెరబడుతున్నారు. ఒక చేత్తో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కాజేసేందుకు పావులు కదుపుతూనే, మరో చేత్తో ప్రైవేటు భూములను కొట్టేసేందుకు కుట్రలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఈ దందా తారస్థాయికి చేరుకుంది. వివాదాస్పద భూములను గుర్తించడం.. భూ యజమానులతో బేరసారాలు సాగించడం..మాట వినని వారిపై బెదిరింపులకు దిగడం.. సర్వసాధారణంగా మారిపోయింది. భూ వివాదాలపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సిట్ వేస్తే.. కూటమి పాలనలో ఆ భూముల్లో సైతం సెటిల్‌మెంట్ చేస్తూ నేతలు కోట్లు కుమ్మేస్తున్నారు. అత్యంత ఖరీదైన భూమిని రాజీ చేసినందుకు భూ బకాసురులు జిల్లాకు చెందిన టీడీపీ కీలక నేతకు రూ.కోట్లు విలువజేసే భూమిని గిఫ్ట్‌గా ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఖాళీ జాగా కనిపిస్తే చాలు వచ్చి వాలుతున్న పచ్చ గద్దలు
- వివాదం సృష్టించి.. పరిష్కారం పేరుతో రాజీలు
- ఓ భూ వివాదం రాజీలో రూ.కోట్లు చేతులు మారినట్లు జోరుగా ప్రచారం
- జిల్లాలో టీడీపీ కీలక నేతకు ఎకరం గిఫ్ట్ ఇచ్చినట్లు ఆరోపణలు
- ఈ ఏడాది కాలంలోనే 5 భూ వివాదాల పరిష్కారం
- అధికారులకూ భారీగా ముడుపులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ నేతలు ఎడాపెడా భూ కబ్జాలకు పాల్పడ్డారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు అది ప్రభుత్వ, ప్రైవేటు భూమా అన్న తేడా లేకుండా భూ బకాసురులు రెచ్చిపోతున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో ఈ బెడద ఎక్కువగా ఉంది. ఏడాది కాలంలోనే ఒంగోలు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఐదు భూ వివాదాలను పరిష్కరించినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల నగరంలో జరిగిన ఒక భూ వివాదానికి సంబంధించిన పరిష్కారంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీకి చెందిన కీలక నేత నేరుగా రంగంలోకి దిగి పంచాయితీలు చేస్తుండడంతో కింది స్థాయి నాయకులు సైతం బరితెగిస్తున్నారు. పచ్చ గద్దల భూ మాయాజాలాన్ని చూసి నగర ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

శివారు భూ వివాదంలో..

నగర శివారులోని ఓ భూమిపై కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ వివాదంలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు తెరవెనుక మంత్రాంగం నడిపినట్టు సమాచారం. టీడీపీ కీలక నేత సమక్షంలో పంచాయితీ జరిగిందని తెలిసింది. దీంతో ఆస్థలం కొనుగోలు చేసిన వ్యక్తి సదరు నేతకు ఎకరం భూమి గిఫ్ట్‌గా ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే కేసులో కొంత మంది పోలీసు అధికారులకు సైతం పెద్ద ఎత్తున తాయిలాలు అందినట్టు సమాచారం.

ఉర్దూ స్కూలును పడగొట్టి:

పాత మార్కెట్ సమీపంలోనే ఉర్దూ స్కూలును 1938లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పదేళ్లుగా ఈ స్కూలు శిథిలావస్థకు చేరుకుంది. దీని విస్తీర్ణం 23 సెంట్లు కాగా ఇక్కడ గది రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. రూ.35 కోట్లకు పైగా విలువ చేసే ఉర్దూ స్కూలు భూమి మీద కన్నేసిన పచ్చదండు ఎలాగైనా సరే కబ్జా చేసేందుకు పావులు కదిపారు. ఉర్దూ స్కూలును నేలమట్టం చేసేందుకు మే 2వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. జూలై 1వ తేదీ గుట్టుచప్పుడు కాకుండా ఉర్దూ స్కూలును నేలమట్టం చేశారు. ఇక్కడ టీడీపీకి చెందిన ఒక వ్యాపారవేత్త పెట్రోలు బంకు ఏర్పాటుకు యత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లీజు పేరుతో తక్కువ ధరకే ఈ భూమిని కాజేయాలని చూస్తున్నారని ముస్లింలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలోనూ కీలక నేతకు భారీగా ముడుపులు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

ముక్తినూతలపాడు భూ కబ్జాకు ప్రయత్నం...

నగర శివారులోని ముక్తినూతలపాడు పంచాయతీ సర్వే నంబర్ 15లో 21.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కీలక నేత అనుచరులు ప్రయత్నించడం వివాదంగా మారింది. ఈ భూమిలో 5.60 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఆక్రమించారు. మార్కెట్లో దీని విలువ ఎకరం రూ.6 కోట్లు పైగానే ఉంది. 5.60 ఎకరాలు అంటే స్థలం విలువ సుమారు రూ.36 కోట్లు పైమాటే. కీలక నేత అండదండలతో ఒంగోలు కమ్మపాలేనికి చెందిన ఒక టీడీపీ నాయకుడు, ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన మరో టీడీపీ నాయకుడు కలిసి ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భూమి రికార్డుల్లో కుంట భూమిగా నమోదై ఉంది. దీనిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇంటి స్థలాల కింద పంపిణీ చేయాలని జాన్ ప్రభాకర్ అనే వ్యక్తి హైకోర్టులో కేసు వేశారు. కబ్జాకు గురైన స్థలాన్ని సందర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు ఈ భూమిని కాపాడాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని దత్తాత్రేయ కాలనీ ఎదురుగా ఉన్న 1.36 ఎకరాల అసైన్‌మెంట్ స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేసి అమ్మకాలు చేపట్టడం విమర్శల పాలైంది. ఈ భూమి విలువ సుమారుగా రూ.5 కోట్లకు పైగానే ఉంది. దీనిలో ప్లాట్లు వేసి పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపట్టడం పచ్చదండు బరితెగింపునకు నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. కేశవరాజు కుంట వద్ద సర్వే నంబర్ 81లోని ప్రభుత్వ స్థలాన్ని సైతం పచ్చ మాఫియా కబ్జా చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి.

రూ.వంద కోట్ల ప్రభుత్వ భూమిపై కన్ను...

నగరం నడిబొడ్డున పాత కూరగాయల మార్కెట్ వద్ద 83 సెంట్ల ప్రభుత్వ స్థలంపై టీడీపీ యువనేత ఒకరు కన్నేశారు. 15 సెంట్ల స్థలానికి నగర పాలక సంస్థ నుంచి తాత్కాలిక ఒప్పందం మీద అనుమతులు తీసుకున్నారు. నగర పాలక సంస్థ ఇచ్చిన అనుమతుల ప్రకారం ఆ స్థలంలో ఎలాంటి కట్టడాలు నిర్మించడానికి వీలులేదు. నిబంధనలు బేఖాతరు చేస్తూ రెస్టారెంట్ ఏర్పాటుకు భారీ స్థాయిలో కట్టడాలు చేస్తున్నారు. ఇక్కడ గది రూ.25 లక్షల వరకు ఉంది. ఆ లెక్కన చూస్తే ఈ భూమి విలువ రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇంత ఖరీదైన స్థలాన్ని దొడ్డిదారిన కాజేయడానికి పక్కా ప్రణాళికతోనే నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

రూ.100 కోట్ల భూమి అన్యాక్రాంతం

- సాధారణ లీజు పొంది శాశ్వత నిర్మాణాలు చేపడుతున్న అధికార పార్టీ నాయకులు
- వారితో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు కుమ్మక్కు
- మీ కోసంలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- అన్యాక్రాంతంపై విచారణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు



ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద దాదాపు రూ.100 కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతం అయిందని వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ షేక్ ఇమ్రాన్ ఖాన్ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణకు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో మీ కోసం కార్యక్రమానికి ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, కార్పొరేటర్లు జి.ప్రవీణ్ కుమార్, వెన్నపూస కుమారి, కో–ఆప్షన్ సభ్యులు రషీదా, శ్యామ్ సాగర్‌లు ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను కలిశారు. పాత మార్కెట్ స్థలం అన్యాక్రాంతంపై ఈ ఏడాది జూన్ 29న సాక్షిలో «భూదందా» శీర్షికతో కథనం ప్రచురితమైందని ఆ పేపర్ క్లిప్పింగ్‌ను కూడా అందజేశారు. ఆ విషయమై విచారించామని సుమారుగా రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిందని నిర్ధారించినట్లు వివరించారు. ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులను వాటికి సంబంధించిన లీజు ప్రక్రియ ఆధారాలు అడిగినా సరైన సమాధానం చెప్పలేదన్నారు. ఈ భూమిని అధికార టీడీపీకి చెందిన ఓ నాయకుడుకి తాత్కాలిక లీజుకు ఇచ్చినట్లు తెలిపిందన్నారు. రోడ్డు మార్జిన్‌లో తాత్కాలికంగా పందిళ్లు, చలువ పందిళ్లు, రేకుల గుడారాలు వేసుకునేందుకు టౌన్ ప్లానింగ్ వారు ఒక వారానికి పరిమితంగా 10 చదరపు మీటర్లకు రూ.100 లు చొప్పున రుసుము వసూలు చేయటానికి సంబంధించిన సాధారణ అనుమతి మాత్రమే ఇచ్చారన్నారు. సర్వే నం.77, బ్లాకు నం.4, వార్డు నం.3లో 83 సెంట్ల స్థలంలో సంవత్సరం లీజుకు తాత్కాలిక అనుమతులు ఇస్తే దాదాపు రూ.25 లక్షలకు పైగా వెచ్చించి శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారని ఇన్‌చార్జ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ కౌన్సిల్ సమావేశంలో ఎటువంటి తీర్మానం చేయకుండానే టీడీపీ నాయకులకు మేలు చేసేలా అధికారులు తెగబడ్డారన్నారు. సాధారణ ఓపెన్ ఆక్షన్, టెండర్ జరిపితే దాదాపుగా ఈ స్థలానికి రూ.5 లక్షలు ప్రతినెలా అద్దె లీజు రూపంలో నగరపాలక సంస్థకు వచ్చే అవకాశం ఉందని వివరించారు. కానీ కేవలం రూ.33,600 ఒక సంవత్సరం పాటు లీజుకు ఇవ్వటం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఈ స్థలాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కమర్షియల్ కాంప్లెక్సుగా మార్చి అభివృద్ధి చేయాలని యత్నించి డిజైన్ల కోసం సీబీఆర్ఈ అనే సంస్థకు పంపారని గుర్తు చేశారు. ఇంజినీరింగ్ విభాగం నుంచి ప్రభుత్వానికి అనుమతి కోసం వెళ్లిందన్నారు. ఈ స్థలానికి సంబంధించిన తాత్కాలిక అనుమతులు తొలగించి ఒంగోలు నగరపాలక సంస్థ స్వాధీన పరచుకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ సీరియస్ అయ్యారు. వెంటనే దీనిపై విచారణ కోసం ఒంగోలు తహశీల్దార్, నగర కమిషనర్, మున్సిపల్ సర్వేయర్‌తో కూడిన త్రిసభ్య కమిటీని నియమించారు. మంగళవారం సాయంత్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రూ.కోట్ల విలువైన ఆస్తులు కబ్జాలకు ఆస్కారం

ఒంగోలు నగరంలోని రూ.కోట్ల విలువైన ఆస్తులను టీడీపీ కూటమి ప్రభుత్వం కబ్జాలకు ఆస్కారం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని పాత కూరగాయల మార్కెట్ స్థలం కబ్జాకు గురైందని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఇలాంటి వాటిని ప్రోత్సహించదన్నారు. ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కావటాన్ని సహించేది లేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని కూడా హెచ్చరించారు.

కూరగాయల మార్కెట్‌లో షాపులకు సీళ్లు

- రిటైల్, హోల్‌సేల్ కలిపి దాదాపు 23 షాపులకు సీల్
- మూడు షాపులకు ఒక్కొక్కరు రూ.లక్ష కడితే సీళ్లు తెరచిన అధికారులు



షాపునకు సీల్ వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఒంగోలు సబర్బన్: కొత్త కూరగాయల మార్కెట్ దుకాణదారులపై వేధింపులు ఆగటం లేదు. ఎప్పుడు గుర్తొస్తే అప్పుడు ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు మార్కెట్‌పై దాడులు చేయటం పనిగా పెట్టుకున్నారు. సోమవారం పోలీసులను తీసుకొని కూరగాయల మార్కెట్‌లోని హోల్‌సేల్, రిటైల్ షాపులపై దాడులకు దిగారు. అద్దె బకాయిల పేరుతో నిత్యం వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తం హోల్‌సేల్ షాపుల్లో 8 షాపులకు సీళ్లు వేశారు. అప్పటికప్పుడు రూ.లక్ష చొప్పున కట్టిన మూడు షాపులకు సీళ్లు తొలగించారు. రిటైల్ షాపులకు 15కు పైగా వేశారు. ఈ విధంగా మార్కెట్‌ని షాపులపై దాడులు చేయటంతో వ్యాపారులు బెంబేలెత్తారు. పాలకులు, అధికారులు చేసిన పాపానికి కూరగాయల మార్కెట్‌లోని షాపుల లీజుదారులు అల్లాడిపోతున్నారు.



పోలీసులతో పాటు వచ్చిన మున్సిపల్ అధికారులు

గంజాయి ముఠా అరెస్టు

- 3.100 కేజీల గంజాయి, రూ.9.06 లక్షల సొత్తు స్వాధీనం



సమావేశంలో నిందితులతో పాటు సొత్తును ప్రదర్శిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: గంజాయి అక్రమంగా రవాణా చేస్తూ అమ్మకాలు సాగిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 3.100 కేజీల గంజాయి, రూ.9.06 లక్షల విలువైన వెండి, బంగారు వస్తువులు, వెండి కరిగించే మిషన్, కట్టర్ స్వాధీనం చేసుకున్నట్లు సింగరాయకొండ సీఐ హజరత్తయ్య వెల్లడించారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హజంఘడ్ జిల్లా టేక్కా మండలం మెయిన్పూర్ గ్రామానికి చెందిన ముకేష్‌కుమార్ మద్దిపాడులో నివసిస్తున్నాడు. ఇతనితో పాటు 65 కేసుల్లో ముద్దాయిగా ఉన్న గుంటూరు జిల్లా అంకిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఒడ్లమాను శివారెడ్డి, ఒంగోలు లోని 10వ డివిజన్ ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద ఉన్న ఇందిరమ్మ కాలనీ దగ్గర గుర్రం జాషువా నగర్ లో నివసిస్తున్న ట్రంకు కార్తీక్‌లు జరుగుమల్లి మండలం వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉండగా వారిని విచారించామన్నారు. ముకేష్‌కుమార్ మద్దిపాడు జాతీయ రహదారి పై లారీల దగ్గర తక్కువ రేటుకు డీజిల్‌కొని అమ్మేవాడు. ఆ ఆదాయం చాలకపోవటంతో గంజాయి అమ్మి అధిక లాభాలు పొందాలనే ఆత్యాశతో లారీ యజమానుల దగ్గర ఒడిశా సరిహద్దుల్లో గంజాయి లభించే మార్గాలను తెలుసుకుని అక్కడికి వెళ్లి కేజీ రూ.10 వేలు చొప్పున తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లు చేసి అమ్మేవాడు. ఇతని వద్ద నుంచి కేజీ రూ.12 వేలకు శివారెడ్డి, కార్తీక్‌లు కొనుగోలు చేసి వారు కూడా చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్మేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ముకేష్‌కుమార్ ఒడిశా నుంచి తెప్పించిన 3.100 కేజీల గంజాయిని వీరిద్దరికి ఇచ్చే క్రమంలో పట్టుకుని వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. తరువాత వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి మోటారుసైకిల్, వెండి కరిగించే మిషన్, సెల్‌ఫోన్‌లు, 8 కేజీల బరువున్న 57 వెండి కడ్డీలు, 9 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. వీరిలో శివారెడ్డి పై ఒంగోలు తాలూకా, హెచ్ఎంపాడు, పొన్నలూరు, జరుగుమల్లి, కొండపి, వెలిగండ్ల మండలాల్లో సుమారు 65 కేసులు ఉన్నాయన్నారు. వీరి పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు సీఐ వివరించారు. ఈ సందర్భంగా సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై బీ మహేంద్ర, సిబ్బంది అమీర్జాన్, నరసింహ, శివకుమార్, నాగూర్‌వలీ, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

బడిలో అవినీతి బాగోతం

- బట్టబయలు చేసిన పాఠశాల విద్యాకమిటీ చైర్మన్
- ఆర్ఓ ప్లాంటు మరమ్మతుల పేరుతో రూ.90 వేలు స్వాహా
- బియ్యం పంపిణీలో చేతివాటం
- అర్ధాకలితో అలమటిస్తున్న విద్యార్థినులు
- సబ్‌కలెక్టర్ విచారణ

మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నిర్వహణ, మధ్యాహ్న భోజనం నిర్వహణలో జరుగుతున్న అవినీతి బాగోతం బట్టబయలైంది. పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం అమలుతీరుపై పరిశీలించేందుకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగూర్ ఖాన్ రాగా అక్కడ జరుగుతున్న అక్రమాలు బయటకు వచ్చాయి. రికార్డులు పరిశీలించగా రిజిస్టరులో నమోదు చేసిన బియ్యానికి, వంట మనుషుల వద్ద ఉన్న బియ్యానికి తేడా రావడంతో హెచ్ఎం శ్రీదేవిని ప్రశ్నించారు. దీంతో ఆమె హడావుడిగా రిజిస్టర్లను దిద్దటానికి ప్రయత్నిస్తుండగా అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాను పిలిపించి జరుగుతున్న అక్రమాలను వెల్లడించారు. పాఠశాలలో సుమారు 802 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి అవసరమైన సుమారు 120 కిలోల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా కేవలం 70 కిలోలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. కోడిగుడ్లు కూడా సక్రమంగా అందించకుండా బయట మార్కెట్లో అమ్ముకుంటున్నారన్నారు. విద్యార్థులకు అవసరమైన మంచినీటి కోసం పాఠశాలలో ఆర్ఓ ప్లాంటును ఏర్పాటు చేశారు. అయితే గతేడాది ప్రభుత్వం నిర్వహణ నిమిత్తం లక్ష రూపాయలు మంజూరు చేయగా కేవలం



విచారణ చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహశీల్దార్

రూ.10 వేలు ఖర్చుపెట్టి రూ.90 వేలు తన సొంతానికి వాడుకున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన మెనూ రికార్డులను తనముందే తారుమారు చేస్తున్నట్లు గుర్తించారన్నారు. రికార్డులకు సంబంధించిన రిజిస్టరును విలేకరుల ఎదుట చూపారు. పదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి వారికి కావాల్సిన టీసీలు, మార్కు లిస్టులు తదితరాలు ఇచ్చేందుకు రూ.500 వసూలు చేస్తున్నారని తెలిపారు. హెచ్ఎం శ్రీదేవిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, సబ్‌కలెక్టర్ విచారణ చేపట్టాలని కోరారు.



రిజిస్టరులో నమోదైన వివరాలు

సబ్‌కలెక్టర్ విచారణ:

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ ఆరోపణలపై మార్కాపురం సబ్‌కలెక్టర్ త్రివినాగ్, తహశీల్దార్ చిరంజీవి పాఠశాలకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తహశీల్దార్ తెలిపారు.

క్లుప్తంగా

నాయకత్వంపై హెచ్‌ఎంలకు శిక్షణ

పొదిలి: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పొదిలిలోని జోసఫ్ శ్రీహర్ష అండ్ ఇంద్రజ మేరీ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాలలో నాలుగు రోజుల శిక్షణను మార్కాపురం డీవైఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాలల్లో అమలు చేయాలని కోరారు. కోర్సు డైరెక్టర్‌గా మర్రిపూడి ఎంఈఓ రంగయ్య వ్యవహరించారు. శిక్షణ ఉద్దేశాలను వివరించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి డి.నాగరాజు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం.జాలరత్నం, ఎంఈఓ యు.శ్రీనివాసులు, 289 పాఠశాలల హెచ్‌ఎంలు, 9 మంది మాస్టర్ ఫెసిలిటేటర్స్ పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 94 ఫిర్యాదులు

ఒంగోలు టౌన్: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు పోలీసు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదులను స్వీకరించిన ఉన్నతాధికారులు ఆయా స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీఎస్టీ సెల్ సీఐ దుర్గాప్రసాద్, డీటీసీ సీఐ షమీముల్లా, పీజీఆర్ఎస్ ఎస్సై జనార్దనరావు పాల్గొన్నారు.

గ్రానైట్ గనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి



గ్రానైట్ గనుల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ

చీమకుర్తి రూరల్: గ్రానైట్ గనుల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచించారు. సోమవారం చీమకుర్తి మండలంలోని పలు గ్రానైట్ గనులు, పరిశ్రమలను ఎస్పీ దామోదర్‌తో కలిసి ఐజీ సందర్శించారు. భద్రతా ప్రమాణాలపై పలు సలహాలు, సూచనలు చేశారు. ముందుగా చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ గనులు, పరిశ్రమలలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు అధిక సంఖ్యలో ఉండటంతో ఎక్కువ నేరాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. చీమకుర్తి సీఐ సుబ్బారావు, ఎస్సైలు కృష్ణయ్య, హరిబాబు, శివరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మేజర్ కాలువలో ఉన్న చిల్లచెట్ల కంప — తూములో పేరుకుపోయిన పూడిక — మైనర్ వద్ద పూడిక తీయకపోవడంతో నీరెళ్లే దారి లేని దృశ్యం

అరకొర నిధులు పనులు

- సాగర్ కాలువల మరమ్మతులకు నిధుల కొరత
- తూతూమంత్రంగా పనులు
- ప్రధాన కాలువ మొదలు.. పంట కాలువల వరకూ మొక్కుబడిగా మరమ్మతులు
- అధ్వానంగా ఉన్న కాలువలు
- ఎలాంటి ప్రయోజనం లేదంటున్న రైతులు



సాగర్ ప్రధాన కాలువ కట్టపై ఉన్న ముళ్లకంప

త్రిపురాంతకం: జిల్లాకు ప్రధాన నీటి వనరైన సాగర్ జలాల విషయంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాకు సరిపడా నీటిని రాబట్టడంలో, వాటిని సక్రమంగా నిల్వ చేసి రైతులు, ప్రజల అవసరాలకు సరఫరా చేయడంలో తరచూ విఫలమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నప్పటికీ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు మాత్రం సాగర్ నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వీడటం లేదు. చివరకు సాగర్ కాలువలకు మరమ్మతుల విషయంలోనూ ప్రభుత్వం, అధికారులు, పాలకులు అలసత్వం ప్రదర్శించారు. కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేయడంతో పాటు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల మొక్కుబడి పనితీరు కారణంగా నాగార్జున సాగర్ ప్రధాన కాలువ నుంచి పంట కాలువల వరకూ అధ్వానంగా ఉన్నాయి. అరకొర నిధులతో అరకొరగానే కాలువలకు మరమ్మతులు చేసి వదిలేయడంతో అస్తవ్యస్తంగా ఉన్నాయి.

పిచ్చిచెట్లు తొలగించి.. కాలువల్లోనే వదిలేసి...

సాగర్ ప్రధాన కాలువ గట్ల వెంట పిచ్చిచెట్లు, తుమ్మచెట్లు పెరిగిపోవడంతో గట్లకు రెండువైపులా వాటిని తొలగించేందుకు జిల్లా సరిహద్దు నుంచి 35 కిలోమీటర్ల మేర పనులు నిర్వహించారు. దట్టంగా పెరిగిన చెట్లను తొలగించినప్పటికీ.. వాటిని అక్కడి నుంచి తరలించకుండా ఎక్కడికక్కడే వదిలేశారు. అరకొరగా చేసిన చెట్ల తొలగింపు పనుల కోసం సుమారు 12 లక్షల రూపాయలు వెచ్చించినట్లు అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ హయాంలో ఆధునికీకరణ...

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సాగర్ ప్రధాన కాలువ కట్టలకు రెండు వైపులా లైనింగ్ పనులు పూర్తిచేసి ఆధునికీరించారు. ఆ పనుల నిర్వహణ పటిష్టంగా ఉండటంతో నేటికీ కాలువ కట్టలు బలంగా ఉన్నాయి. అయితే, ఇటీవల అక్కడక్కడా కట్టలను మట్టి కోసం తొలగించడంతో ఆయా ప్రాంతాల్లో కట్టలు బలహీనపడుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగర్ ప్రధాన కాలువ మరమ్మతులకు సరిపడా నిధులు కేటాయించకపోవడంతో సక్రమంగా పనులు జరగలేదన్న విమర్శలున్నాయి. ప్రధాన కాలువ నుంచి ఏర్పాటు చేసిన మేజర్ల షట్టర్లు మరమ్మతులకు గురైనప్పటికీ పట్టించుకోకుండా వదిలేశారు.

మేజర్లు, మైనర్లకు సైతం మొక్కుబడిగా మరమ్మతులు...

సాగర్ మేజర్ కాలువలు, మైనర్ కాలువలు, పంట కాలువలకు సైతం నామమాత్రంగానే మరమ్మతులు పూర్తి చేశారు. కాలువల్లో, గట్లపై తొలగించిన చిల్లచెట్ల కంపను అక్కడే వదిలేశారు. కాలువలకు నీరు విడుదల చేస్తే కంప మొత్తం అడ్డుపడి సక్రమంగా ప్రవహించే పరిస్థితి లేదు. దీంతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. తొలగించిన కంప చెట్లను అక్కడి నుంచి దూరంగా తరలించాలని కోరుతున్నారు. కొన్నిచోట్ల పక్కనున్న పంట పొలాల్లోకి పిచ్చికంపను నెట్టివేయడంతో ఆయా పొలాల రైతులు లబోదిబోమంటున్నారు.

ఒక్కో మేజర్‌కు రెండుమూడు లక్షలే విడుదల...

సాగర్ కాలువల మరమ్మతులకు సంబంధించి త్రిపురాంతకం సబ్ డివిజన్‌లో ప్రభుత్వం 20 పనులు మంజూరు చేసి కేవలం రూ.70 లక్షలే కేటాయించింది. ఒక్కో మేజర్‌కు రెండుమూడు లక్షల రూపాయలు మాత్రమే విడుదల చేయడంతో నామమాత్రపు నిధులతో నాసిరకంగా పనులు చేశారు. ఈ నిధులు.. ఈ పనులు చెప్పుకోవడానికే తప్ప కాలువలకు, ఆయకట్టు రైతులకు ఉపయోగపడేలా లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయకట్టులోని చివరి భూములకు నీరందే అవకాశమే లేదని రైతులు వాపోతున్నారు. మేజర్, మైనర్ కాలువలకు పటిష్టంగా మరమ్మతులు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, కానీ, కొద్దిపాటి నిధులు కేటాయించి పైపైన పనులు చేసి వదిలేస్తే ఎలాంటి ఫలితం దక్కే అవకాశం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలకు మరమ్మతులు చేసేందుకు ఇప్పటి వరకూ ఒక ప్రణాళిక లేకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల మరమ్మతులు చేపడతామని చెప్పినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో పంట కాలువలు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. వాటి మరమ్మతులకు సమన్వయంతో వ్యవహరించాల్సిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం, పాలకులు విఫలమవడంతో రైతులు, ప్రజలకు అవస్థలు తప్పేలా లేవు.



అధ్వానంగా ఉన్న పంట కాలువ



పిచ్చికంప, తుంగతో నిండిపోయిన పంట కాలువ



మేజర్లపై తొలగించి పక్కనున్న పంట పొలాల్లో వదిలేసిన పిచ్చికంప

‘గ్రామ సమాఖ్య’ స్ఫూర్తికి విఘాతం

- బైలాను తుంగలో తొక్కి ఇష్టారీతిగా కమిటీల మార్పు
- సమాఖ్య నిధుల దోపిడీకి స్కెచ్

బేస్తవారిపేట: టీడీపీ నాయకుల ఒత్తిడితో అక్రమంగా వీఓఏలను తొలగించిన అధికారులు తాజాగా గ్రామ సమాఖ్య కమిటీలను ఇష్టారీతిగా మార్చడం చర్చనీయాంశమైంది. రూల్స్ పుస్తకాల్లో ఉంటాయి.. కానీ తమకు వర్తించవు, తాము పాటించము అన్నట్లు ఉంది వెలుగు కార్యాలయ సీసీలు వ్యవహార శైలి. వివరాల్లోకి వెళ్తే.. బేస్తవారిపేట మండలంలోని వంగపాడు, ఖాజీపురం, ఎంపీ చెరువు గ్రామ సమాఖ్య కమిటీలను గుట్టుచప్పుడు కాకుండా తొలగించి కొత్త కమిటీలను తెరపైకి తీసుకొచ్చారు. సాధారణంగా ఒక్కో గ్రామ సమాఖ్య కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఏపీ పరస్పర సహాయక సహకార సంఘాల చట్టం బైలా నిబంధనల ప్రకారం సభ్యుల తొలగింపునకు 30 రోజులు ముందుగా నోటీసులు ఇచ్చి గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించాలి. ఏటా 3తో భాగించబడే పాలకవర్గ సభ్యులు పదవీ విరమణ చేయగా.. కొత్తవారిని నియమించడం లేదంటే వారినే ఎన్నుకోవాలన్నది నిబంధన. ఎప్పటికీ ఐదుగురు సభ్యులను ఒకేసారి తొలగించకూడదనే నిబంధన సైతం బైలాలో పొందుపరిచారు. కొత్తగా ఇద్దరిని మాత్రమే గ్రామ సమాఖ్య కమిటీలోకి తీసుకోవాలని బైలాలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ పాత కమిటీ సభ్యులకు తెలియకుండానే వెలుగు సీసీలు నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. ఐదుగురు సభ్యులను కొత్తవారిని ఎన్నుకున్నట్లు సీసీ సంబంధిత బ్యాంకు మేనేజర్‌కు లెటర్ ఇవ్వడంతో బ్యాంకులో నూతన కమిటీ సభ్యులతో బ్యాంక్ ఖాతా నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో గ్రామ సమాఖ్యలో ఉన్న నగదు విత్‌డ్రా చేశారు. ఆ డబ్బు ఏమైందో తెలియడం లేదని పాత కమిటీ సభ్యులు వాపోతున్నారు. గ్రామ సమాఖ్య కమిటీ సభ్యుల అడ్డగోలు తొలగింపుపై వంగపాడు గ్రామానికి చెందిన పాత కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.



గ్రామ సమాఖ్య కమిటీ నిబంధనల పుస్తకం

ఆయన రూటే.. సప‘రేటు’!

- కార్యదర్శులను బెదిరించి వసూళ్ల పర్వం
- మండలాల వారీగా టార్గెట్లు ఫిక్స్
- డివిజన్ అధికారి తీరుపై ఏసీబీ, ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా!

మార్కాపురం: ఆయన డివిజన్ స్థాయి ప్రభుత్వ అధికారి.. రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నారు.. దీప ముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెతను కార్యరూపంలోకి తెచ్చి కాసులు దండుకుంటున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. తనిఖీల పేరుతో గ్రామాలకు వెళ్తూ పంచాయతీల కార్యదర్శుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండటంతో.. ఆయనొస్తున్నారంటేనే వణికిపోతున్నారు. ‘మీరేమైనా చేసుకోండి.. ఎంతైనా సంపాదించుకోండి.. నాకు మాత్రం నగదు ఇవ్వాల్సిందే.. లేదంటే రికార్డులన్నీ పక్కాగా తనిఖీ చేస్తా.. గ్రామ పంచాయతీ పన్ను వసూళ్లు పరిశీలిస్తా.. పారిశుధ్యం చూస్తా.. ఇందులో ఏ ఒక్కటి సరిగ్గా లేకున్నా మెమోలు ఇస్తా’ అని బెదిరిస్తుండటంతో కార్యదర్శులు ఎంతో కొంత ముట్టజెప్పి ఆ అధికారి గండం నుంచి బయటపడుతున్నారు. మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో పంచాయతీ కార్యదర్శులపై సదరు డివిజన్ స్థాయి అధికారి పంజా విసిరాడు. అయితే తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో ఇద్దరు కార్యదర్శులు మామూళ్లు ఇచ్చే విషయంలో ఎదురు తిరగడంతో ఆ అధికారి నిజస్వరూపం బయటపడింది. మార్కాపురం పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో ఉన్న కార్యాలయం నుంచి సదరు అధికారి కారులో బయలుదేరారంటే ఎంతో కొంత వసూలు చేయకుండా తిరిగి రావడం లేదన్నది కార్యాలయ వర్గాల భోగట్టా.

మార్కాపురం డివిజన్‌లోని 3 నియోజకవర్గాల్లో సుమారు 200కు పైగా గ్రామ పంచాయతీలు, వీటితో పాటు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక కార్యదర్శిని ప్రభుత్వం నియమించింది. వారు 18 నుంచి 20 రికార్డులు నిర్వహించాలి. ముఖ్యంగా ఇంటి పన్ను, నీళ్ల పన్ను వసూలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర పనులను గ్రామ స్థాయిలో రోజూ పర్యవేక్షించాలి. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు అధికారి సచివాలయానికి వెళ్లి ఐదేళ్ల రికార్డులు తెమ్మంటూ భయపెడతాడు. అన్నీ ఉంటే పారిశుధ్యం, ఇంటిపన్ను వసూళ్లు చూద్దాం పదా అంటాడు. ఇవన్నీ ఎందుకులే అనుకున్న తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల కారదర్శులు ఒక్కొక్కరు రూ.5 వేల చొప్పున నజరానాలు సమర్పించుకున్నారు. మార్కాపురం, పెద్దారవీడు, యర్రగొండ పాలెం, పెద్దదోర్నాల మండలాల్లో ఒక్కో కార్యదర్శి నుంచి రూ.3 వేల చొప్పున వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. డివిజన్ అధికారి వసూళ్ల దందా ఏసీబీ, ఇటు ఇంటెలిజెన్స్ వర్గాల దృష్టికి వెళ్లడంతో సదరు అధికారి తీరుపై రెండు రోజుల క్రితం సమాచారం సేకరించినట్లు తెలిసింది. మొత్తం మీద రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్న ఆ అధికారి తీరు వివాదాస్పదమైంది.

వైఎస్సార్ విగ్రహం తొలగింపునకు కుట్ర



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


- సబ్ కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేతల అర్జీ

మార్కాపురం టౌన్: పెద్దారవీడు మండలంలోని హనుమాన్ జంక్షన్(కుంట) సెంటర్‌లో సుమారు 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించేందుకు చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గుంటూరు, కర్నూలు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు ఎటువంటి ఆటంకం లేకపోయినా వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించాలని అధికారులతో కలిసి కొందరు రాజకీయ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విగ్రహాన్ని తొలగించాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు. అర్జీ ఇచ్చినవారిలో సర్పంచ్ మల్లేశ్వరి, నాయకులు లక్ష్మీనారాయణ, మేకల కాశయ్య, ఎస్కె నూర్ అహ్మద్, రామచంద్రుడు, నారాయణ, దానం, సుబ్బారావు, నాగార్జునరెడ్డి, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

కూటమి పార్టీల్లో ఆధిపత్య పోరు.!

- దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి సాక్షిగా బహిర్గతం
- బీజేపీపై నెగ్గిన టీడీపీ పంతం
- టీడీపీకి చెందిన నాగవేణికే ఏఎంసీ ఛైర్మన్ పదవి
- తొలుత బీజేపీకి చెందిన నారాయణమ్మకు కేటాయిస్తూ ఉత్తర్వులు
- పంతానికి పోయి ఉత్తర్వులు మార్పించిన టీడీపీ దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి
- భగ్గుమంటున్న బీజేపీ నేతలు

సాక్షి ప్రతినిధి ఒంగోలు: దర్శి కేంద్రంగా కూటమి పార్టీల్లో ఆధిపత్య పోరు ఊపందుకుంది. దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్ పదవి విషయంలో కూటమి పార్టీలైన టీడీపీ-బీజేపీ మధ్య అగ్గి రాజుకుంది. ఈ పదవిని టీడీపీకి చెందిన ఓసీ మహిళకు కేటాయించేందుకు ఎస్సీ రిజర్వేషన్‌ను సైతం టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి మార్పించారు. టీడీపీకి చెందిన దారం సుబ్బారావు సతీమణి, దర్శి 19వ వార్డు కౌన్సిలర్ దారం నాగవేణి పేరును ప్రకటించారు. కాపు సామాజిక వర్గానికి చెందిన నాగవేణి కోసం ఎస్సీలకు కేటాయించిన సీటును మార్పించి ఎస్సీలకు అన్యాయం చేశారు. కానీ, బీజేపీ నేతలు పావులు కదిపి ఆ పార్టీ నాయకుడు మాడపాకుల శ్రీనివాసులు భార్య నారాయణమ్మకు దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి అధికారికంగా ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. అయితే, తాజాగా బీజేపీకి కేటాయించిన దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవిని మళ్లీ టీడీపీకే కట్టబెట్టారు. జీవో సవరణ పేరుతో గతంలో ప్రకటించిన మాడపాకుల నారాయణమ్మ పేరు మార్చి దారం నాగవేణికి ఛైర్మన్ పదవిస్తూ జీవో సవరణ చేశారు. దీంతో బీజేపీ నేతలకు టీడీపీ నేతలు షాక్ ఇచ్చినట్లయింది.



దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవికి పేరు మార్చి ఇచ్చిన జీఓ

మంత్రుల ద్వారా పావులు కదిపిన గొట్టిపాటి లక్ష్మి...

బీజేపీ నాయకులు అనూహ్యంగా ఏఎంసీ ఛైర్మన్ పదవి దక్కించుకోగా, ఆ ఉత్తర్వులు మార్పించేందుకు మంత్రుల ద్వారా పావులు కదిపి గొట్టిపాటి లక్ష్మి సక్సెస్ అయ్యారు. బీసీ కులానికి చెందిన బీజేపీ నాయకుని భార్య మాలపాకుల నారాయణమ్మ పేరును ఛైర్మన్ పదవికి ఖరారు చేస్తూ జీవో విడుదలైంది. దీంతో తమకు మాట ఇచ్చి వేరొకరికి పదవి కట్టబెట్టడంపై గొట్టిపాటి లక్ష్మిని నాగవేణి వర్గీయులు, టీడీపీ నేతలు గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి ద్వారా గొట్టిపాటి లక్ష్మి పేరు మార్పు చేయించినట్లు సమాచారం. సోమవారం గుంటూరు మార్కెట్ యార్డ్‌లోనే ఈ మార్పు చేయించి సంబంధిత ఉత్తర్వుల కాపీ తీసుకున్న తర్వాతే గొట్టిపాటి లక్ష్మి దర్శి వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మండిపడుతున్న ఎస్సీ, బీసీలు...

సోమవారం కురిచేడు మండలం కల్లూరు వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి గొట్టిపాటి లక్ష్మి రావాల్సి ఉండగా, పేరు మార్చిన జీవో కాపీ చేతికి వచ్చిన తర్వాతే దర్శి వస్తానని పట్టుబట్టింది. ఆ జీవో తీసుకున్న తర్వాతే గొట్టిపాటి లక్ష్మి దర్శి వచ్చారని దర్శి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, నియోజకవర్గంలో ఎస్సీలకు కేటాయించిన సీటును కాదని ఓసీలకు మార్చారని, ఆ తర్వాత అధిష్టానం బీసీలకు కేటాయిస్తే వారికి కూడా దక్కనీయకుండా ఓసీలకు కట్టబెట్టడంపై ఎస్సీలు, బీసీలు మండిపడుతున్నారు. తమది బీసీల పార్టీ అని చెప్పుకునే టీడీపీ.. ఇప్పుడు బీసీలకు తీరని అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి బీజేపీ నేతలు...

ఏఎంసీ ఛైర్మన్ పదవికి పేరు మార్చడంపై దర్శి బీజేపీ నేతలు వెంటనే తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ని కలిసినట్లు తెలిసింది. తమకు జరిగిన అన్యాయాన్ని వారు వివరించినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు రాష్ట్ర అధ్యక్షుడు స్పందిస్తూ మరో పదవి ఇప్పించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా.. వచ్చేసారైనా మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి తమకు లభించేలా చేయాలని కోరినట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీకి ఇచ్చిన ఒక్క పదవి కూడా వారికి దక్కకుండా టీడీపీ నేతలు పేరు మార్చడంతో తామంతా పార్టీకి కష్టపడి పనిచేయడం ఎందుకని బీజేపీ నేతలు ఆవేదన వెల్లగక్కుతున్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకుడు, మాడపాకుల నారాయణమ్మ భర్త శ్రీనివాసులను సాక్షి ప్రతినిధి సంప్రదించగా, తామంతా కూటమిలో భాగస్తులమని, గత ఎన్నికల్లో కూటమికి కష్టపడి పని చేశామని చెప్పారు. తమకు వచ్చిన అవకాశాన్ని దక్కకుండా మార్పు చేయడం తమను ఎంతో బాధిస్తోందన్నారు. అధికారికంగా ఇచ్చిన జీవోలో సునాయాసంగా పేర్లు మార్పు చేయించడంపై అసహనం వ్యక్తం చేశారు.

17.65 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దర్శి: రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి అక్రమ రవాణాకు సిద్ధం చేస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. దర్శి పట్టణంలోని ఓ రైస్ మిల్లులో 706 బస్తాల(25 కేజీలవి)ను సోమవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ తెలిపారు. బియ్యాన్ని గోతాల్లో ప్యాకింగ్ చేస్తుండగా తనిఖీ చేశామని, వాటిని రేషన్ బియ్యంగా నిర్ధారించి కేసు నమోదు చేశామని డీటీ వివరించారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి

పామూరు: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన పామూరు మండలంలోని వగ్గంపల్లెలో సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ రసూల్ (28) కనిగిరి మసీదులో పనిచేస్తున్నాడు. రసూల్‌కు పామూరుకు చెందిన యువతితో వివాహం కాగా, మనస్పర్థలతో రెండు సంవత్సరాలుగా విడిపోయి దూరంగా ఎవరి ఊళ్లలో వారు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎప్పటిలాగా కనిగిరి పోయి వస్తానని ఇంట్లో తల్లి మస్తాన్‌బీకి చెప్పి వెళ్లిన రసూల్.. ఇంటికి తిరిగి రాలేదు. దీనిపై మస్తాన్‌బీ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. సోమవారం కొందరు పశువుల కాపరులు మండలంలోని రావిగుంటపల్లె సమీపంలో 565వ నంబర్ జాతీయ రహదారి సమీపంలోని చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని మృతిచెంది ఉన్నట్లు వీఆర్‌ఓ గాబ్రియేల్‌కు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ మీరు పోగొట్టుకున్న కాలిన చిరిగిన 10th, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికెట్స్ తెప్పించబడును. పేరు మా ర్పిడికి గైడెన్స్ స్టూడెంట్ సర్వీసెస్ సెంటర్, N.శ్రీనివాసరావు, GNT. 9849185616 [SCA25006093]

REAL ESTATE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 8142292071 [G-652]

Wanted

■ మార్కాపురం నందు స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ మానసిక వికలాంగుల పాఠశాలలో పనిచేయుటకు లేడీ టీచర్స్ 24 గంటలు ఉండేవాళ్ళు కావలెను. Q:ఇంటర్ / డిగ్రీ సంప్ర: సెల్: 94409 31182, 63001 28576. [SCA25006270]

■ స్కూల్ నందు ఇంగ్లీష్ (6th-9th), మ్యాథ్స్ (1st-5th), సోషల్ (6th-9th), బయాలజీ (8th-9th) సబ్జెక్ట్స్‌కు టీచర్స్ కావలెను. సెల్: 81868 57374. [SCA25006092]

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: - డిగ్రీ, జీతం: - 20 వేల వరకు. సంప్ర॥ 9908429239 [G-646]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02762

బరితెగించిన గ్రావెల్ మాఫియా



గ్రావెల్‌ను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న జేసీబీ

- బేస్తవారిపేట మండలం మోక్షగుండం సమీపంలో కరిగిపోతున్న కొండ
- 2 జేసీబీలు, 20 ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమ రవాణా
- 3 రోజులుగా దోచేస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు

బేస్తవారిపేట: అధికార పార్టీ నేతల అండతో గిద్దలూరు నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమార్కులు చెలరేగుతున్నారు. ఇప్పటికే పెంచికలపాడు సమీపంలోని చెరువు మట్టిని బేస్తవారిపేట, కొమరోలు, గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో ఇటుకల బట్టీలకు నిరంతరం తరలిస్తున్నారు. తాజాగా జగనన్న కాలనీ వద్ద ఉన్న కొండపై అక్రమార్కుల కన్ను పడింది. అనుమతి తీసుకోకుండా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మండల స్థాయి అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి గ్రావెల్ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం సమీపంలో ఉన్న జగనన్న కాలనీ పైఎత్తున ఉన్న కొండపై అక్రమార్కులు కన్నేశారు. గత మూడు రోజులుగా ప్రభుత్వ భూముల్లో రెండు జేసీబీలతో గ్రావెల్ తవ్వి, 20 ట్రాక్టర్లతో దర్జాగా తరలిస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో అక్రమార్కులకు అడ్డులేకుండా పోయింది. సోమవారం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమంగా మట్టి తరలిస్తున్నారని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ‘మా వద్ద స్టాఫ్ ఇద్దరే ఉన్నారు.. మేము ఎక్కడికని రావాలి.. స్థానికంగానే అడ్డుకోండి’ అని సెలవిచ్చారని మోక్షగుండం గ్రామస్తులు తెలిపారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని మట్టి అక్రమ రవాణాను అడ్డుకుని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మోక్షగుండం, పందిళ్లపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.



కొండను తొలుస్తున్న జేసీబీలు